ఇప్పుడు మనం బైబిల్ లోని పూర్వభాగమైన ఓల్డ్ టెస్టమెంట్‌లో రెండవ అధ్యాయమైన 'ఎక్సోడస్' గురించి తెలుసుకోబోతున్నాం. ఇప్పటిదాకా చెప్పిన కథల్లో చాలా పేర్లు, స్థలాలు విని కంగారుపడిన వారున్నారు. ఇవన్నీ గుర్తు పెట్టుకోవడం ఎలా? అని అడిగారు. మన హిందూ పురాణాల్లో కూడా అందరి పేర్లూ మనకు తెలుసా? విశ్వామిత్రుడి తండ్రి పేరేమిటి? యయాతి తాత పేరేమిటి? అంటే నోరు వెళ్లబెట్టమా? ముఖ్యమైన పనులు చేసినవారి గురించి తెలుసుకుంటే చాలు. వాళ్లు చేసిన పనులు లీలగా గుర్తుంటే చాలు. వామనుడు బలి చక్రవర్తిని తొక్కేసి పాతాళానికి పంపాడు అనే ఘట్టం గుర్తుంటే చాలు. వామనుడి తండ్రి పేరు, బలి చక్రవర్తి రాజ్యం పేరు యివన్నీ గుర్తు పెట్టుకోనక్కరలేదు. నిజానికి బైబిల్‌లో యింకా చాలా చాలా పేర్లున్నాయి. అవన్నీ వదిలేశాను. ముఖ్యమైన ఘట్టాలు – ఏడమ్ అండ్ ఈవ్, కేన్ అండ్ ఏబల్, నోవాస్ ఆర్క్, బేబల్ టవర్ , అబ్రహాం, జేకబ్, జోసెఫ్.. వీళ్లంతా మొదటి అధ్యాయంలో ముఖ్యమైన(వి) వారు. అవి గుర్తు పెట్టుకుని వాళ్ల భార్యల పేర్లు, పిల్లల పేర్లూ వదిలేయవచ్చు. మొత్తం మీద మానవజాతి చరిత్ర ప్రపంచమంతా ఒకేలా వుంది అని అర్థమైతే చాలు.

పురాణగ్రంథం అంటే పవిత్రంగా వుంటుందనుకున్నాను, అంతా కొట్లాటలు, మోసాలు, వ్యభిచారాలు వున్నాయేమిటి అని కొందరు అడిగారు. మహాభారతం చదవండి. అదీ యిలాటిదే. పురాణాలు అంటే రామకోటి రాసినట్టుగా దేవుడి పేర్లు కోటిసార్లు రాసి వుండవు. మానవపరిణామాన్ని అవి చెప్తాయి. నిజాయితీగా చెప్పాలని పెద్దలు అనుకున్నారు కాబట్టి జరిగినది జరిగినట్టు (అతిశయోక్తులు వుండవచ్చు) రాసుకుని వచ్చారు. మసిపూసి మారేడుకాయ చేయలేదు. ఈనాటి కాలానికి ఎబ్బెట్టుగా వున్నవి ఆనాటికి అవి ధర్మసమ్మతం అయి వుండవచ్చు అని అనుకుంటే చాలు. ఈనాటి కళ్లతో ఆనాటి వ్యక్తులను తూకం వేయకూడదు. రాముడైనా సరే, జోసెఫ్ అయినా సరే..!

మానవులలో లోపాలను గమనించి వారిని ఒక దారిలో పెట్టడానికి, నియమబద్ధమైన జీవితాన్ని గడపాలని చెప్పడానికి బైబిల్‌లో భగవంతుడు 'టెన్ కమాండ్‌మెంట్స్' (దశాదేశాలు) యిచ్చాడు. అది మోజెస్ అనే వ్యక్తి ద్వారా మనుష్యులకు యిచ్చాడు. ఆ ఘట్టం ఈ ఎక్సోడస్ అధ్యాయంలో వస్తుంది. ఎక్సోడస్ అంటే నిష్క్రమణ అని అర్థం. ఈజిప్టులో బానిసలుగా మగ్గుతున్న హీబ్రూ జాతిని దాస్యం నుండి విముక్తి చేసి వారిని స్వతంత్ర భూమి ఐన ఇజ్రాయేలుకు తరలించిన గాథ యిది. బైబిల్‌లో గమనించవలసినది ఏమిటంటే ఇది హీబ్రూ గ్రంథం. హీబ్రూ దేవుడి గొప్పతనం వర్ణించే గ్రంథం. అదే సమయంలో లోకంలో యితర దేవుళ్లు కూడా వున్నారని చెప్తుంది బైబిల్. ఈజిప్టువాళ్ల దేవుడు వేరే వున్నాడు. కానీ హీబ్రూ దేవుడు వాళ్ల కంటె గొప్పవాడు, శక్తిమంతుడు అని చెప్తుంది యీ అధ్యాయం. మరి యావత్ ప్రపంచానికి దేవుడు ఒక్కడే అని ఎలా అనగలం? యావత్ హీబ్రూలకు దేవుడు ఒక్కడే అని మాత్రం అనగలం. గ్రీక్, రోమన్ పురాణాల్లో మన హిందువుల లాగే చాలామంది దేవుళ్లుంటారు. వాళ్లల్లో వాళ్లు పోట్లాడుకుంటూ వుంటారు కూడా, మన దేవుళ్ల లాగానే.

జోసెఫ్ ఈజిప్టులో స్థిరపడడంతో మొదటి అధ్యాయం పూర్తయింది. తర్వాత అతని వారసులు ఈజిప్టులోనే వుండిపోయారు. కొన్ని తరాల పాటు వాళ్లు తామరతంపరగా పెరిగిపోయి ఈజిప్టు వాళ్ల కంటె సంఖ్యలో ఎక్కువై పోయారు. వీళ్లు యిలాగే పెరుగుతూ పోతే తలచుకుంటే వాళ్లు భవిష్యత్తులో శత్రువులతో చేతులు కలిపి మనల్ని ఓడించగలరన్న భయం పట్టుకుంది అప్పటి ఈజిప్టు రాజుకి. వాళ్లకు తలకు మించిన పని అప్పగించి వాళ్ల నైతిక స్థయిర్యాన్ని దెబ్బ తీద్దామని చూశాడు. వాళ్లు కష్టాలు పడుతున్నారు కానీ వాళ్ల సంతతి మాత్రం ఆగలేదు. చివరకు వాళ్లను బానిసలుగా చేసి వాళ్ల చేత బండచాకిరీ చేయించారు ఈజిప్షియన్లు. రాజు ఓ యిద్దరు హీబ్రూ మంత్రసానులను పిలిచి మీరు హీబ్రూ స్త్రీల ప్రసూతి సమయంలో మగ పిల్లవాడు పుడితే రహస్యంగా పీక పిసికి చంపేయండి. ఆడపిల్లయితే బతకనివ్వండి. మీకు బహుమతులు యిస్తాను అని ఆశ పెట్టాడు. వాళ్లు "హీబ్రూ స్త్రీలు చాలా ఆరోగ్యవంతులు. మేం రాకుండానే పిల్లల్ని కనేస్తున్నారు" అని చెప్పి తప్పించుకున్నారు. ఇక యిలాక్కాదని రాజు ఓ ఆజ్ఞ జారీ చేశాడు – హీబ్రూ మగపిల్లవాడు పుట్టీ పుట్టగానే తీసుకెళ్లి నైల్ నదిలో పడేయాలని. ఆడపిల్లయితే బతకవచ్చు.

లెవి జాతిలో ఒక స్త్రీకి కొడుకు పుట్టాడు. వాణ్ని చంపడానికి చేతులు రాక మూణ్నెళ్లపాటు రహస్యంగా పెంచింది. ఆ తర్వాత దాచడం సాధ్యం కాక తారు పూసిన ఓ వెదురుబుట్టలో పిల్లవాణ్ని పెట్టి నైల్ నది రెల్లు పొదల్లో వదిలిపెట్టింది. ఆ పిల్లవాడి అక్క ఓ మూల నక్కి ఏమవుతుందో చూడసాగింది. ఆ రాజుగారి కూతురు నదీస్నానానికి వచ్చింది. ఆ బుట్టను గమనించి తన వద్దకు తెప్పించుకుని, పిల్లవాణ్ని చూసి జాలిపడింది. హీబ్రూ అయినా సరే, తను పెంచుకుంటానంది. ఈ మాటలు వినగానే ఆ పిల్లాడి అక్క ఆమె వద్దకు వెళ్లి పిల్లవాడికి పాలిచ్చి పెంచడానికి ఆయా కావాలా? అని అడిగింది. రాకుమార్తె సరేననగానే వెళ్లి తల్లిని పిలుచుకుని వచ్చింది. "ఈ పిల్లవాణ్ని నా తరఫున పెంచు. నేను డబ్బిస్తా." అంది రాకుమార్తె. అలా కొన్నేళ్లు పెంచాక తన వద్దకు తెప్పించుకుని నేను నీటిలోంచి యీ పిల్లవాణ్ని బయటకు లాగాను



కాబట్టి "మోజెస్" (బయటకు లాగడానికి హీబ్రూ మాట) అని పేరు పెట్టుకుంటాను అంది.

యువకుడయ్యాక మోజెస్ ఒకసారి తన జాతివాళ్లు ఎలా వున్నారో చూడబోయాడు. బానిసలుగా వాళ్లు పడే కష్టాలు చూసి జాలిపడ్డాడు. ఒక ఈజిప్టువాడు హీబ్రూను చంపడం చూసి కోపంతో ఎవరూ లేకుండా లేకుండా చూసి ఈజిప్టువాణ్ని చంపేశాడు. కానీ అది ఓ హీబ్రూ చూడనే చూశాడు. మర్నాడు అతను మరొకడితో పోట్లాడుతూంటే మధ్యవర్తిత్వం చేయబోయిన మోజెస్‌ను "నువ్వెవడివి పెద్ద తీర్పు చెప్పేవాడిలా వచ్చావ్? నీ మాట వినకపోతే ఆ ఈజిప్టువాణ్ని చంపినట్టు నన్నూ చంపేస్తావా?" అని అడిగాడు. ఇది యితరులు విన్నారు. రాజు చెవులదాకా యీ వార్త చేరింది. మోజెస్‌ను చంపమని ఆయన ఆజ్ఞ జారీ చేశాడు. మోజెస్ ప్రాణభీతితో మిడియన్ దేశానికి పారిపోయాడు. అక్కడ అతను ఒక నూతి వద్ద కూర్చుని వుండగా జెత్రో అనే పూజారి కూతుళ్లు వచ్చి నీళ్ల తోడుకోసాగారు. వాళ్లను కొందరు గొఱ్ఱెలు కాచుకునేవారు సతాయిస్తే మోజెస్ వాళ్లను రక్షించి నీళ్లు నింపి యిచ్చాడు. వాళ్లు వెళ్లి తమ తండ్రికి చెప్పగానే అతను మోజెస్‌ను యింటికి ఆహ్వానించి విందు నిచ్చాడు. అతని గుణగణాలు నచ్చి తన కూతురు జిపోరానిచ్చి పెళ్లి చేశాడు. వాళ్లకు జెర్షామ్ అనే కొడుకు పుట్టాడు.

ఈజిప్టులో రాజు మరణించాడు. కానీ అక్కడున్న హీబ్రూల కష్టాలు తీరలేదు. వాళ్లు పెట్టుకున్న మొరలు దేవుడు ఆలకించాడు. ఒకరోజు దేవుడు మోజెస్‌తో మాట్లాడాడు. మోజెస్ సినాయ్ అనే ఒక పవిత్రపర్వతం మీదుగా వెళుతూంటే ఒక పొదనుండి అగ్ని వెలువడుతోంది. అది వెలుగునిస్తోంది తప్ప పొదను దహించడం లేదు. "మోజెస్, నీ చెప్పులు తీసేసి యిటు రా" అంది ఆ జ్వాల. మోజెస్ ఆశ్చర్యపడుతూనే దగ్గరకు వెళ్లాడు. "నా ప్రజలు ఈజిప్టులో అష్టకష్టాలు పడుతున్నారు. నువ్వు వెళ్లి వాళ్లను విముక్తులను చేయాలి. అక్కడున్న హీబ్రూలను పవిత్రదేశానికి తరలించాలి. కానీ అక్కడి రాజు నువ్వు వాళ్లను తీసుకుని పోతావంటే ఒప్పుకోడు. నువ్వు కొన్ని మహిమలు చూపి అతన్ని భయపెట్టాలి." అన్నాడు దేవుడు.



"నాకు మహిమలు ఏవీ రావుగా" అన్నాడు మోజెస్.

"నీ చేతికర్రను నేలపై పడేయ్" అన్నాడు దేవుడు. కిందపడగానే అది పాముగా మారింది. మోజెస్ తోక పట్టుకుని పైకి లేవనెత్తగానే చేతికర్రగా మారింది. "ఈ ఇంద్రజాలం చూసి కూడా నమ్మకపోతే మరొకటి చేసి చూపించు. నీ అరచేతిని జేబులో పెట్టి తీయి. చూశావా రక్తహీనంగా, మచ్చలతో బయటకు వచ్చింది.. మళ్లీ యింకోసారి జేబులో పెట్టి తీయి. చూశావా, మామూలుగా అయిపోయింది.. ఈ మిరకిల్ కూడా చేసి చూపించు. ఇదీ నమ్మలేదనుకో అప్పుడు నైల్ నదీ జలాన్ని నేలమీద పోయి. అది రక్తంగా మారిపోతుంది. అప్పుడు నువ్వు చెప్పినది ఆ రాజు వింటాడు" అని విశదంగా చెప్పాడు దేవుడు.

ఇంత చెప్పినా మోజెస్ శంకిస్తూనే వున్నాడు. "నాకు సరిగ్గా వాదించడం రాదు, దేవా, నన్నెందుకు యీ పనికి నియోగిస్తున్నావ్" అని అడిగాడు.

"పిచ్చివాడా, మనుషులకు నోరు యిచ్చేది, అందులో కొందర్ని మూగవాళ్లను చేసేదీ నేనే. నేనుండగా నీకు భయం ఎందుకు? అయినా నువ్వు అన్నావు కాబట్టి నీ తమ్ముడు ఆరాన్ నీ బదులు మాట్లాడతాడు. నువ్వు నీ చేతికర్ర చేతపట్టి ఈజిప్టుకి వెళ్లి నీ ప్రజలను స్వేచ్ఛాపథంలో నడిపించు" అన్నాడు దేవుడు. తక్కిన కథ వచ్చే గురువారం. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**